నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్
5 | నిజామాబాద్, శనివారం 23 డిసెంబర్ 2023 | ADILABAD



ముజ్గి గ్రామంలో కొత్తగా నిర్మించిన రామాలయంలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి

మాజీ మంత్రుల పూజలు

ఆదిలాబాద్‌లో జోగు రామన్న, ముజ్గిలో ఐకేరెడ్డి

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 22: మండలంలోని బెల్లూరి అయ్యప్ప స్వామి ఆలయంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న తన మొక్కును శుక్రవారం చెల్లించుకున్నారు. బెల్లం తులా భారంతో మొక్కును సమర్పించుకున్నారు. ప్రధాన అర్చకులు దూబే సాయి కృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. జోగు రామన్నను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. ఫ్లోర్ లీడర్ బండారి సతీశ్, వేణు యాదవ్, లక్ష్మణ్, బెల్లూరి అయ్యప్ప ఆలయ కమిటీ అధ్యక్షుడు కుంభోజి సూర్యకాంత్ స్వామి, ఆలయ ప్రధాన కార్యదర్శి దాముక రవీందర్, ఆలయ వ్యవస్థాపక సభ్యులు తాటిపెల్లి శివప్రసాద్, ఆలయ మాజీ ప్రధాన కార్యదర్శులు గురుస్వామి చంద గురుస్వామి, ఆలయ కోశాధికారి టింగం నరేశ్ గురుస్వామి, దిలీప్ గురుస్వామి బృందం పాల్గొన్నారు.

ముజ్గిలో మాజీ మంత్రి అల్లోల

సోన్, డిసెంబర్ 22: నిర్మల్ మండలంలోని ముజ్గి గ్రామంలో కొత్తగా నిర్మించిన రామాలయంలో శుక్రవారం ఉదయం శ్రీ సీతా సమేత రాముడి యంత్రస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీ సీతా రాముల కల్యాణ మహోత్సవాన్ని పురోహితుడు ఫణతుల ప్రవీణ్‌శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి హాజరై పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సర్పంచ్ పొలాస రాజమణి మల్లేశ్, ఎంపీటీసీ సంతోష్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

మొక్కులు చెల్లించుకుంటున్న మాజీ మంత్రి జోగు రామన్న

దళారుల దందాకు చెక్

పత్తి సీసీఐకే అమ్మేలా చర్యలు

- 11 కేంద్రాల్లో కొనుగోళ్లకు ఏర్పాట్లు
- రైతుల ఇబ్బందులు తొలగిస్తున్న అధికారులు
- ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ ఆధ్వర్యంలో పర్యవేక్షణ
- నాలుగు ప్రత్యేక బృందాలు ఏర్పాటు
- అక్రమాలకు అడ్డుకట్ట, మద్దతు ధరపై అవగాహన

ఆదిలాబాద్ జిల్లాలో పత్తి విక్రయాల్లో దళారుల ప్రమేయం లేకుండా అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. రైతులు నష్టపోకుండా ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. ఈ దందాను నివారించడానికి ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ వికాస్ మహతో పర్యవేక్షణలో వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలతో కూడిన నాలుగు బృందాలు ఏర్పాటు చేశారు. పత్తిని సీసీఐకి అమ్మితే కలిగే లాభాలు, దళారుల వల్ల నష్టాలను గ్రామాల్లో వివరిస్తున్నారు. సీసీఐ ద్వారా ఏర్పాటు చేసిన 11 కేంద్రాల్లో మద్దతు ధరను సద్వినియోగం చేసుకొని పత్తిని విక్రయించాలని అధికారులు కోరుతున్నారు. రైతులను మోసం చేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు.

ఆదిలాబాద్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్ జిల్లాలో వానకాలం సీజన్‌లో రైతులు 4,12,436 ఎకరాల్లో పత్తి పంటను వేశారు. ఈ సీజన్‌లో 28.87 లక్షల క్వింటాళ్ల పంట మార్కెట్‌కు వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా సీసీఐ ఆధ్వర్యంలో 11 కేంద్రాలను ఏర్పాటు చేశారు. అక్టోబరు చివరి వారంలో పంట కొనుగోళ్లు ప్రారంభం కాగా, ఆదిలాబాద్‌లో రెండు, బేల, ఇచ్చోడ, బోథ్, సొనాల, పొచ్చర, నేరడిగొండ, ఇంద్రవెల్లి, నార్నూర్‌లలో మద్దతు ధరతో పంటను సేకరిస్తున్నారు. గతేడాది క్వింటాలుకు రూ. 6380 ఉండగా ఈ ఏడాది రూ.640 పెంచి రూ. 7020తో సీసీఐ ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా సీసీఐ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 2,97,885 క్వింటాళ్ల పత్తిని రైతుల వద్ద కొనుగోలు చేశారు. మార్కెట్ యార్డుల్లో ప్రైవేటు వ్యాపారులు సైతం పత్తిని కొనుగోలు చేస్తున్నారు. వీరు కూడా 2,82,310 క్వింటాళ్ల పంటను సేకరించారు. పత్తి కొనుగోళ్ల పర్యవేక్షణను మార్కెట్‌యార్డులో సిబ్బంది పర్యవేక్షిస్తూ రైతులకు ఇబ్బందులు రాకుండా చూస్తున్నారు.

అధికారుల నజర్

జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు మహారాష్ట్రకు చెందిన దళారులు గ్రామాల్లో తిరుగుతూ రైతుల వద్ద నుంచి పంటను కొనుగోలు చేస్తారు. తమ ఇంటివద్దే పత్తిని అమ్ముకునే అవకాశం ఉండడంతో రైతులు దళారులకు పంటను విక్రయించడానికి ఆసక్తి చూపుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకుండా దళారుల కొనుగోళ్లు జరగుతుండడంతో రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది. తేమ, నాణ్యత పేరిట దళారులు తక్కువ ధరను చెల్లించడం, తూకంలో మోసాలకు పాల్పడడం, పంట విక్రయానికి సంబంధించిన డబ్బులను కొన్ని రోజుల తర్వాత చెల్లిస్తామని చెప్పి మోసం చేయడం లాంటివి జరుగుతుంటాయి. ఈ దందాను నివారించడానికి అధికారులు చర్యలు చేపట్టారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచనల మేరకు ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ వికాస్ మహతో పర్యవేక్షణలో నాలుగు బృందాలను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యవసాయాధికారి, మార్కెటింగ్ శాఖ అధికారులతో పాటు మార్కెటింగ్ సిబ్బంది మండల వ్యవసాయ అధికారులు బృందంలో ఉంటారు. వీరు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి రైతులు దళారులకు పంటను అమ్మకుండా అవగాహన కల్పిస్తారు.

తలమడుగు మండలం కజ్జర్లలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పంటను సీసీఐకే అమ్మాలి

ఆదిలాబాద్ జిల్లాలో 11 కేంద్రాల్లో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు జరుగుతున్నాయి. మద్దతు ధర క్వింటాలుకు రూ.7020తో సిబ్బంది పంటను సేకరిస్తున్నారు. రైతులు తమ పంటను మార్కెట్‌యార్డుల్లోని సీసీఐ కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలి. గ్రామాల్లో రైతులు దళారులకు పంటను విక్రయించి మోసపోకుండా చూస్తున్నా. రైతులను మోసం చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

-శ్రీనివాస్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి (ఆదిలాబాద్)

హ్యాపీ బర్త్‌డే

ఎమ్మెల్సీ దండె విఠల్‌కు జాన్సన్ నాయక్ శుభాకాంక్షలు

ఖానాపూర్, డిసెంబర్ 22: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్ పుట్టినరోజు సందర్భంగా హైదరాబాద్‌లోని తన నివాసంలో ఖానాపూర్ బీఆర్ఎస్ నేత భూక్యా జాన్సన్‌నాయక్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. రానున్న రోజుల్లో రాజకీయాల్లో ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

ఎమ్మెల్సీ దండె విఠల్‌కు శుభాకాంక్షలుతెలుపుతున్న జాన్సన్ నాయక్

రికార్డులు పరిశీలిస్తున్న శిక్షణ కలెక్టర్ వికాస్ మహతో

రైతులు మోసపోకుండా చూడాలి

- ట్రైనీ కలెక్టర్ వికాస్ మహతో
- పత్తి కొనుగోలు కేంద్రాల పరిశీలన

ఇంద్రవెల్లి, డిసెంబర్ 22: పత్తి కొనుగోలు కేంద్రాల్లో రైతులు మోసపోకుండా అధికారులు జాగ్రతలు తీసుకోవాలని శిక్షణ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. మండలంలోని ఐఎఫ్‌సీఎల్, విజయలక్ష్మి, మిఠల్ జిన్నింగ్ మిల్లుల్లో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. నిల్వ ఉన్న పత్తితోపాటు కొనుగోలు చేసిన పత్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంద్రవెల్లి మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ లేకపోవడంతో గుడిహత్నూర్, ఉట్నూర్ మండలానికి వెళ్లి లింక్ చేసుకోవాల్సి వస్తున్నదని రైతులు తెలిపారు. స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి రైతులకు సమస్యలు రాకుండా చూడాలన్నారు. ప్రైవేట్ వ్యాపారులకు రైతులు పత్తి విక్రయించి మోసపోకుండా చూడాలని సూచించారు. ఏఎంసీ కార్యదర్శి రాజేశ్వర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించాలి'

ఎదులాపురం, డిసెంబర్ 22: జాతీయ లోక్ అదాలత్‌లో అధిక కేసులు పరిష్కరించాలని కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కోర్టు సమావేశ మందిరంలో బ్యాంకర్లు, ఇన్సురెన్స్ ప్రతినిధులు, ఆర్టీసీ, కార్మిక శాఖ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ.. ఈనెల 30న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అలాగే కార్మిక శాఖలో ఖాళీగా ఉన్న జిల్లా స్థాయి పోస్టుల విషయంలో ప్రభుత్వానికి లేఖ రాయాలని డీఎల్ఎస్ఏ కార్యదర్శికి సూచించారు. తర్వలోనే ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లతో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారిని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా న్యాయమూర్తులు డాక్టర్ శివరాం ప్రసాద్, ప్రమీలాజైన్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్రాల నగేష్, పీపీ రమణా రెడ్డి, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ రాజలింగు తదితరులున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024, 9640400073.
NT-314374

CHANGE OF NAME
I, KASOJU SRIKANTH S/O KASOJI CHANDRA MOULI , R/o H.No. 2-119, Chincholi B (Vill) Sarangapur (Mdl) Nirmal (D) ,TS Changed My name to KASOJI SRIKANTH for all future purposes

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

ముక్కోటి ఉపవాసం.. కోటి యజ్ఞాల ఫలం

- నేడు వైకుంఠ (ముక్కోటి) ఏకాదశి
- ఉత్తర ద్వార దర్శనం కోసం ఏర్పాట్లు

చెన్నూర్ టౌన్/మందమర్రి, డిసెంబర్ 22 : సాధారణంగా హిందువుల పండుగలన్నీ చంద్రమానం ప్రకారమో లేక సౌరమానం ప్రకారమో జరుపుకుంటారు. కానీ, ఈ రెండింటి కలయికతో ఆచరించే ఒకే ఒక్క పండుగ ముక్కోటి ఏకాదశి. సూర్యుడు ధనుస్సు రాశిలో ప్రవేశించిన తర్వాత (సౌరమానం) వచ్చే శుద్ధ ఏకాదేశి(చంద్రమానం) రోజున ముక్కోటి ఏకాదశి వైభవంగా నిర్వహిస్తారు. ముక్కోటి ఏకాదశి ఉపవాసం ఉండి స్వామిని దర్శించుకుంటే కోటి యజ్ఞాలు చేసిన పుణ్యం లభిస్తుందని పురాణాలు చెబుతున్నాయి.

ఉత్తర ద్వార దర్శనంతో మోక్షం

ముక్కోటి ఏకాదశి పండుగను భక్తులు శనివారం వైభవంగా జరుపుకునేందుకు ఆలయాల్లో నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ రోజున ముక్కోటి దేవతలందరూ విష్ణుమూర్తిని దర్శించుకున్నారని ఓ గాథ ప్రాచుర్యంలో ఉంది. అందుకే దీనికి ముక్కోటి ఏకాదశి అని పేరు వచ్చిందని చెబుతుంటారు. ఈనాడే మధుకైటభులనే రాక్షసులకు శాపవిమోచనం కలిగించి, వారికి తన వైకుంఠ ద్వారం వద్ద విష్ణువు దర్శనాన్ని అనుగ్రహించాడు. తమలాగే ఈరోజున ఎవరైతే వైకుంఠ ద్వారాన్ని పోలిన ఉత్తర ద్వారాన్ని నిర్మించి స్వామిని దర్శించుకుంటారో, వారికి మోక్షాన్ని ప్రసాదించమని వారు వేడుకున్నారట. అప్పటి నుంచి ఉత్తర ద్వారం గుండా శ్రీవారిని దర్శించుకునే ఆచారం మొదలైంది. ఈ ఏకాదశి రోజే వైకుంఠంలోని విష్ణుమూర్తి అంతరంగిక ద్వారాలు తెరుచుకున్నాయి. అందుకే దీనికి 'వైకుంఠ ఏకాదశి' అనే పేరు స్థిరపడింది. వైకుంఠ ఏకాదశి రోజు వైష్ణవాలయాల్లో ప్రత్యేకంగా తెరిచి ఉంచే వైకుంఠ (ఉత్తర) ద్వారం గుండా స్వామిని దర్శించుకనేందుకు భక్తులు ఎదురుచూస్తారు.

మందమర్రి పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయ ముఖ ద్వారం వద్ద చేసిన ఏర్పాట్లు

ఏకాదశి వ్రతంతో పుణ్యం, పురుషార్థం..

ఏకాదశి అంటేనే హిందువులకు పరమపవిత్రమైన రోజు. ఈ రోజు ఎవరైతే నిష్ఠగా ఏకాదశి వ్రతాన్ని చేస్తారో వారు వైకుంఠాన్ని చేరే వరాన్ని విష్ణుమూర్తి ప్రసాదించాడని ప్రతీతి. అందుకే యేటా ఏకాదశి రోజు మన పెద్దలు క్రమం తప్పకుండా ఉపవాసం చేసేవారు. దీంతో ఏకాదశి ఫలం పుణ్యం, ఆరోగ్యమనే పురుషార్థమూ రెండూ లభించేవి. సూర్యుడు ఉత్తరాయణంలోకి ప్రవేశించే ఈ ధనుర్మాసంలోని ముక్కోటి ఏకాదశి రోజు ఉపవాసం చేస్తే, మిగతా ఏకాదశి రోజులన్నింటిలోనూ ఉపవాసం ఉన్నంత ఫలం దక్కుతుందని నమ్మకం. వైకుంఠ ఏకాదశి రోజు తప్పకుండా ఏకాదశి వ్రతాన్ని ఆచరిస్తారు. ఏకాదశి రోజు కేవలం ఉపవాసం ఉండడమే కాకుండా ధ్యానంతోను, జపతపాలతోను భగవంతున్ని ఆరాధించాలని పెద్దలు సూచిస్తారు. ఆకలి, దప్పికలను అదుపులో ఉంచుకోవడమే ఏకాదశి వ్రత విశిష్టతగా పండితులు పేర్కొంటారు. మరుసటి రోజు ద్వాదశిన ఎవరికైనా అన్నదానం చేసి ఉపవాసాన్ని విరమించాలని చెబుతారు.

ఆలయాల్లో ఏర్పాట్లు

చెన్నూర్‌లోని జగన్నాథ, మందమర్రి పట్టణంలోని వేంకటేశ్వర ఆలయాలు ఉత్తర ద్వార దర్శనం కోసం నిర్వాహకులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి తెల్లవారుజామున నుంచే స్వామివారిని ఉత్తర ద్వారం గుండా దర్శించుకుంటారు. మందమర్రిలో ఆలయ ప్రధాన అర్చకులు గోవర్ధనగిరి అనంతాచార్యులు, ఆయన తనయుడు నర్సింహాచార్యులు ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం నాలుగు గంటలకు సుప్రభాత సేవ, పంచామృత అభిషేకం, అర్చన, పుష్పోత్సవం 5.30 గంటలకు ఉత్తర ద్వారా దర్శనం జరుగుతుందని అర్చకులు తెలిపారు. ఆయాచోట్ల బారీకేడ్లు, టెంట్లు ఏర్పాటు చేశారు.

డోంగర్‌గాంలో బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

సమస్యలపై స్పందించాలి

- అధికారులకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సూచన
- అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి రూ.50 వేలు అందజేత

గుడిహత్నూర్, డిసెంబర్ 22: ప్రజా సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సూచించారు. మండలంలోని డోంగర్‌గామ్‌లో బీఆర్ఎస్ నాయకుడు దోమకొండ సుధాకర్ ఇల్లు విద్యుదాఘాతంతో దగ్ధమైంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తక్షణ సహాయం కింద రూ.50 వేలు అందజేశారు. తప్పకుండా ఇల్లు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. తహసీల్దార్ అందుబాటులో లేకపోవడంతో ఆమెతో ఫోన్‌లో మాట్లాడారు. పల్లె ప్రజలకు సమస్యలు వస్తే సంబంధిత అధికారులు వారి ఇంటికి వెళ్లి పూర్తి నివేదికను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గం చూపాలని సూచించారు. అదే గ్రామానికి చెందిన రోఫ్ ఖాన్‌ను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎంపీటీసీలు కేంద్రె న్యాను, షగీర్‌ఖాన్, జాదవ్, పీఏసీఎస్ చైర్మన్ ముండె సంజీవ్, జాదవ్ రమేశ్, ఆడె శీల, రాథోడ్ ప్రతాప్, పవార్ రవీందర్, మారుతి, కేంద్రె వెంకట్‌రావ్, బేర దేవన్న, సంతోష్ గౌడ్, ఎండీ గఫార్, జమీల్, ససానే సిద్ధార్థ్, సలీం ఖాన్, ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక ప్రదర్శననిస్తున్న విద్యార్థినులు

అట్టహాసంగా సాఫ్ట్‌బాల్ పోటీలు

ప్రారంభించిన నిర్మల్ కలెక్టర్, మున్సిపల్ చైర్మన్

నిర్మల్ టౌన్, డిసెంబర్ 22: నిర్మల్ పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో శుక్రవారం రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ అండర్-17 పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌తో పాటు మున్సిపల్ చైర్మన్ గంధ్రత్ ఈశ్వర్ ప్రారంభించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. విద్యార్థుల మార్చ్ ఫాస్ట్, క్రీడల పతాకావిష్కరణ, పరిచయం, అనంతరం పోటీలను ప్రారంభించారు. అండర్-17 విభాగంలో మొత్తం 20 పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో గెలిచిన వారు రాజస్థాన్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించి జట్టు గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. డీవైఎస్‌వో నఫియా ఖాన్, ఏసీజీ పద్మ, డీపీఆర్వో తిరుమల, స్టాఫ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు పోశెట్టి , కార్యదర్శి అన్నపూర్ణ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాసరలో రామనుజన్ జయంతి వేడుకలు

ఆర్జీయూకేటీలో రామానుజన్ జయంతి

బాసర, డిసెంబర్ 22: గణిత మేధావి రామానుజన్ జయంతిని శుక్రవారం బాసర ఆర్జీయూకేటీలో ఘనంగా నిర్వహించారు. ఆర్జీయూకేటీ పరిపాలనా భవనంలోని కాన్ఫరెన్స్ హాల్ నందు మ్యాథమెటిక్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో రామానుజన్ చిత్రపటానికి వీసీ వెంకటరమణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ దృష్టిని తన వైపు తిప్పుకున్న మేధావి శ్రీనివాస రామానుజన్ అని, ఈ నేపథ్యంలో జాతీయ గణిత దినోత్సవం ఈ రోజు నిర్వహించుకుంటున్నామని చెప్పారు. మ్యాథమెటిక్స్ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ అడెపు మధుసూదన్, అసోసియేట్ డీన్స్ డాక్టర్ పావని, సృజన, డా. దత్తు, తదితరులు పాల్గొన్నారు.

ఇథనాల్ పరిశ్రమ పనులు ఆపాల్సిందే

- న్యూలోలం రైతులు, యువకుల డిమాండ్
- జాతీయ రహదారిపై బైఠాయింపు

దిలావర్‌పూర్ డిసెంబర్ 22: గుండంపల్లి పరిసర ప్రాంతంలో నిర్మిస్తున్న ఇథనాల్ పరిశ్రమ పనులు తక్షణమే నిలిపేయాలని న్యూలోలం గ్రామానికి చెందిన రైతులు, యువకులు డిమాండ్ చేశారు. నిర్మల్ బైంసా 61వ జాతీయ రహదారిపై శుక్రవారం ధర్నా నిర్వహించారు. గంట పాటు బైఠాయించడంతో, ట్రాఫిక్ నిలిచిపోయింది. ఇథనాల్ పరిశ్రమతో తమ బతుకులు ఆగం అవుతాయని, పంటలు, వన్యప్రాణులకు నష్టం వాటిల్లడంతో పాటు భూగర్భ జలాలు కలుషితమవుతాయని పేర్కొన్నారు. పరిశ్రమ పనులు నిలిపివేసే దాకా ఆందోళనలు కొనసాగిస్తామని చెప్పారు.

దిలావర్‌పూర్: న్యూ లోలం జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు, యువకులు